మా స్కూల్‌ను కుదించొద్దు!

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యా ప్రమాణాలను పెంచితే కూటమి సర్కారు రివర్స్ గేర్‌లో వెళుతోంది. పాఠశాల విద్యకు తూట్లు పొడిచి పేద విద్యార్థులకు అన్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్కు ఉండకూడదన్న లక్ష్యంతో తీసుకుంటున్న చర్యలు పేద విద్యార్థులను కలవర పాటుకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే 117 జీవోను రద్దు చేసింది. తాజాగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతి విద్యార్థులను వేరే పాఠశాలలకు తరలించదానికి సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా విద్యాశాఖ అధికారులు సర్వే చేయడంతో గవర వీధి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. తమ పాఠశాలను కొనసాగించాలని కోరుతున్నారు.

- ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించండి
- గవరవీధి జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల వేడుకోలు
- పిల్లల చదువులు పాడు చేయవద్దని తల్లిదండ్రుల వినతి



గవర వీధిలోని జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బుచ్చిరాజు పాలెం గవరవీధి జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా కుదించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. దీంతో విద్యార్థులతో పాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తునారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు సుమారు 350 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 6 నుంచి 8వ తరగతి విద్యార్థులు సుమారు 140 మంది ఉంటారు. తాజాగా సర్కారు తీసుకున్న నిర్ణయంతో 6,78 తరగతుల విద్యార్థులను సమీప హైస్కూల్‌కు తరలించాలని చూస్తే నష్టపోతామని వాపోతున్నారు.



గుడ్డంచులు తయారు చేసి చూపిస్తున్న గవర వీధి విద్యార్థులు

చదువుల పాఠశాలగా గుర్తింపు

గవర వీధి జీవీఎంసీ పాఠశాలకు చదువుల పాఠశాలగా మంచి పేరుంది. ఈ పాఠశాలలో పిల్లలను చదివించేందుకు తల్లి దండ్రులు పోటీ పడుతున్నారు. ఇక్కడ సీటు లభించాలంటే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల మాదిరి పెద్దల రికమండేషన్ కావాల్సిందే. అంతటి ప్రాధాన్యం ఉన్న పాఠశాలను కుదించే యోచనను విరమించుకోవాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

యాక్టివిటీస్‌లో మేటి

విద్యతో పాటు సృజనాత్మకతలో కూడా పాఠశాల విద్యార్థులు మేటిగా నిలుస్తున్నారు. క్రమశిక్షణ కూడా బాగుంటుంది. దీనికి తోడు సృజనాత్మకంగా నూతన ఆవిష్కరణలు చిట్టి చేతులు చేస్తుంటాయి. సామాజిక బాధ్యతతో గుడ్డ సంచులను తయారు చేసి ప్లాస్టిక్ సంచులను నిషేదిద్దామని నినాదాన్ని పాఠశాల విద్యార్థులు 10 ఏళ్ల కిందటే తెచ్చారు.

స్థలాభావం పేరుతో..

చిన్న స్థలంలో ఈ స్కూల్ ఉంది. దీంతో అప్‌గ్రేడ్ చేసేందుకు వీల్లేకుండా పోయింది. దీనిపై మరో అంతస్తు వేయాలన్నా భవనం సామర్థ్యం సహకరించదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మొత్తం 8 తరగతి గదులు ఉన్నాయి. వీటిలో ఒక గది పాఠశాల అవసరాలకు, హెచ్‌ఎం గదిగా వాడుకుంటున్నారు. దీంతో కాస్తా ఇబ్బంది ఏర్పడుతోంది. కొంత స్థలంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ మరుగుదొడ్లు ఉన్న స్థలంలో పైఅంతస్తు వేస్తే తరగతి గదుల సమస్య ఉండదని స్థానికులు చెబుతున్నారు.

పాఠశాల మారాలంటే దూరాభారం

గవర వీధి పరిసర ప్రాంతంలో మరో పాఠశాల లేదు. విద్యార్థులు మూడు కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో 6,7,8 తరగతి విద్యార్థులను వేరే పాఠశాలకు తరలించాలని చూస్తే తమ పిల్లలు నష్టపోతారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం, కంచరపాలెం, కప్పరాడ హైస్కూల్లు దూరంగా ఉన్నాయని వాపోతున్నారు.

అధికారులూ ఆలోచించండి

పాఠశాలను కుదించవద్దని స్థానికులు, పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. అధికారులు మరో సారి ఆలోచించి ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాలని కోరుతున్నారు. అధికారులపై ఒత్తిడి తేవడానికి విద్యార్థుల తల్లి దండ్రులు పూర్వ విద్యార్థులనూ సమీకరిస్తున్నారు.

మంచి స్కూలును పాడు చేయవద్దు



గవర వీధి పాఠశాల అంటే ఈ ప్రాంతంలో మంచి పేరు ఉంది. అలాంటి పాఠశాలను కుదించి విద్యార్థుల భవిష్యత్తును పాడు చేయవద్దు. కోరుతున్నాము. పూర్వ విద్యార్థిగా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాను. అధికారులు, పాలకులు ఆలోచించి పాఠశాలను యధావిధిగా కొనసాగించాలి.

– పి. కోటేశ్వరరావు, పాఠశాల పూర్వ విద్యార్థి

పిల్లలకు అందుబాటులో ఉంది



మా పిల్లలు ఇక్కడే చదువుతున్నారు. మంచి చదువు అందుతోంది. 6,7,8 తరగతులు తీసేస్తే చాలా ఇబ్బందులు పడతాం. ఇంత మంచి చదువులు మాకు ఇతర స్కూల్లో దొరకవు. చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ స్కూల్ ఇలాగే ఉండాలి.

– సావిత్రి, గవర వీధి

ఇది లేక పోతే ప్రైవేటు స్కూలే గతి



ఈ స్కూల్ లేకపోతే ప్రైవేటు స్కూలే గతి. ప్రైవేటు స్కూల్లో చేర్పించాలంటే ఆర్థికంగా మాకు భారమవుతుంది. ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే ఇతర స్కూల్‌కు వెళ్లాంటే మూడు కిలోమీటర్లు వెళ్లాలి. మా స్కూల్‌ను యూపీ స్కూల్‌గానే కొనసాగించండి.

–డి. జ్యోత్స్న, బుచ్చిరాజుపాలెం

క్లుప్తంగా

శంకరరావుకు పలువురు అభినందనలు



సమావేశంలో పాల్గొన్న రీజనల్ నాయకులు

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పిల్లా శంకర రావు ఎన్‌ఎంయూ రీజనల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను గాజువాక డిపోకు చెందిన ఎన్‌ఎంయూ నాయకులతో పాటు, ఆర్టీసీ పలు విభాగాల ఉద్యోగులు,అధికారులు అభినందించారు.గాజువాక డిపో వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నేతలతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి పెన్షర్ల ధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధి

మల్కాపురం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న ధర్నా కార్యక్రమానికి పెన్షనర్లంతా తరలిరావాలని 96 పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు హుస్సేన్,నూకరాజు పిలుపు నిచ్చారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం పెన్షనర్లు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. హయ్యర్ పెన్షన్ అమలు చేయకుండా పాలకులు పలు సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి చేపడుతున్న ధర్నాకు పెన్షనర్లంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

'సాధు మంజీరాలు' ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న పల్లి నల్లనయ్య, తదితరులు

సీతంపేట : అమరావతి విశ్వసాహితి ఆధ్వర్యంలో పి.ఎల్.వి.ప్రసాద్ రచించిన 'సాధు మంజీరాలు' పద్య కవితా సంపుటి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పునకు, మనిషిని సన్మార్గంలో నడపడానికి సాహిత్యం బలమైన సాధనమని పద్య కవిత్వం ద్వారా రచయిత ప్రసాద్ నిరూపిస్తున్నారన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పద్యం తెలుగు జాతి సంస్కృతికి వెన్నెముక అని, శతకం సమాజ సంస్కరణకు బలమైన వాహిక అని తెలిపారు. ప్రముఖ కవి చినసూర్యనారాయణ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఫ్రాన్సిస్, రొంగలి రాములు పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంపే ధ్యేయంగా పనిచేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్.ఎం.ఎస్-2 విభాగాధిపతి జయకుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి పెంపే ధ్యేయంగా ఉద్యోగులంతా పనిచేయాలని స్టీల్‌ప్లాంట్ ఎస్.ఎం.ఎస్-2 విభాగాధిపతి బి. జయకుమార్ కోరారు. ఎస్.ఎం.ఎస్-2 నూతన విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం ఆయన్ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం సంఘం నాయకులు కలిసి అభినందించారు. జయకుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత కష్టాల్లో నుంచి బయటపడటానికి ఈ ఏడాది ఆరున్నర మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. తద్వారా ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి. తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, పుల్లారావు, మోహన్‌బాబు, సాయి ప్రసాద్, బి. అరవింద్, రవి, సువర్ణరాజు, ఎం.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట పాఠశాలలో 'పరీక్ష -పే' 2025 చర్చ



తరగతి గదుల్లో పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల విద్యాశాఖ– సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 'పరీక్ష -పే' 2025 చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులతో చేపట్టిన సంభాషణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ శ్రీనివాస రావు నేతృత్వంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వీక్షించారు. పాఠశాలలో 6,7,8, 9 తరగతులు విద్యార్థులకు డీడీ, దూరదర్శన్, డీడీ ఇండియా చానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం పరీక్ష పే చర్చలో భాగస్వాములు అయినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం, హరినాథ్, వెంకటరమణ, ఆదిశేషు, ఉమాసత్యవేణి, ఉషారాణి, శిరీష, నిర్మల, రోహిణి, కనకరత్నం, గీతా, పల్లవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్

గోపాలపట్నం: ప్రతీ వాహనదారుడు రహదారి భద్రత నియమాలు పాటించాలని మోటారు వాహన తనిఖీ అధికారి బుచ్చిరాజు కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఎలమర్తి నర్సింగ్ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. 18 ఏళ్లు నిండని వారు ద్విచక్రవాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే విధానం గురించి వివరించారు. రాంగ్ రూట్ ప్రయాణం 70 శాతం పైగా ప్రమాదాలకు కారణమవుతోందని తెలిపారు. ద్విచక్రవాహనం నడిపే తప్పని సరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. హెల్మెట్ లేక పోతే జరిమానాతో పాటు 3 నెలలు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్

కంచరపాలెం: ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగులకు చెక్ పడుతుందని జిల్లా న్యూక్లియర్ మెడికల్ అధికారి(డీఎన్‌ఎంవో) డాక్టర్ పద్మజ అన్నారు.

కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జీవీఎంసీ విద్యాశాఖ, ఆర్పీపేట పబ్లిక్‌హెల్త్ సెంటర్ ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ మట్టా శశి ప్రియాంక ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా న్యూక్లియర్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడే పిల్లలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. నులిపురుగుల వల్ల వచ్చే కడుపు నొప్పిని నివారించడానికి సహాయపడతాయన్నారు. సుమారు 652 మందికి మాత్రలు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, బాలరాజు, వైద్యసిబ్బంది హెచ్‌వీ భారతి, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ పద్మజ, డాక్టర్ ప్రియాంక, హెచ్‌ఎం శ్రీనివాసరావు

అపూర్వ కలయిక



ఆనాటి ఉపాధ్యాయులతో 2000 - 01 బ్యాచ్ విద్యార్థులు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం పరిధి సాంబమూర్తినగర్ పోర్ట్ క్వార్టర్స్‌లో గల జీవీఎంసీ కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 2000 – 2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో కలుసుకున్నారు. పాఠశాలను వీడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున వారి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. ఆత్మీయ కలయికలో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఆనాటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.ఎస్.కె శాస్త్రిని ఘనంగా సన్మానించుకుని ఆయన దీవెనలు పొందారు. ఆనాటి పాఠశాల చిత్రంతో జ్ఞాపికలను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నిర్వాహకులు అందజేశారు.

వైభవంగా లలితా కామేశ్వరుల కల్యాణం

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శ్రీలలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠం 76వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి పర్యవేక్షణలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేద మంత్రాల మధ్య లలితా కామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తకంగా కల్యాణం చేశారు. లలితా కామేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, అభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. ముందుగా లలితా కామేశ్వరులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణాన్ని, లలితాదేవి సన్నిధిని, దర్బారు హాలును వివిధ రకాల పువ్వులు, పండ్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం లలితా అమ్మవారికి 250 కిలోల అన్నాభిషేకం నిర్వహించనున్నామని పీఠం మేనేజర్ తెలిపారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మరో 177 హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్ల జారీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు చెందిన హయ్యర్ పెన్షన్‌కు సంబంధించి మరో 177 డిమాండ్ లెటర్లు జారీ అయ్యాయి. స్టీల్‌ప్లాంట్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్ నిబంధనలు హయ్యర్ పెన్షన్‌కు అనుగుణంగా ఉన్నాయని ప్రావిడెంట్ ఫండ్ అధికారులు తెలిపిన తర్వాత మొదటసారి ఈనెల 7న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన సుమారు 480 మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు డిమాండ్ నోటీసులు జారీ అయ్యాయి. మరలా సోమవారం రెండో డిమాండ్ లెటర్లు జారీ కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారంలోగా మిగిలిన అందరి ఉద్యోగులకు డిమాండ్ లెటర్లు అందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ – యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. సోమవారం కేజీహెచ్‌లో పలు విభాగాధిపతులు, వైద్యులు, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. రోజూ ఇక నుంచి ఒక డిప్యూటీ సూపరింటెండెంట్, డీసీఎస్‌ఆర్ ఎంవోలు ఓపీలను సందర్శించి, అక్కడ వైద్యుల సమయపాలన, రోగుల ఇబ్బందులను ప్రత్యేక ఫార్మేట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ నివేదిక ప్రకారం వైద్యులు, నర్సింగ్, ఇతర మెడికల్, పారా మెడికల్ సిబ్బంది విధులపై నిఘా ఉంచుతామన్నారు. కేజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బంది విధుల మీద కూడ నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ మాధవిలత, డాక్టర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సుమతి, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఫుట్ పాత్ ఆక్రమణలను ట్రాఫిక్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. రెండు రోజుల కిందట టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా సుకన్య సినిమా హాలు నుంచి సప్తగిరి పెట్రోల్ బంక్ వరకు ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించారు. అయితే సచివాలయ సుక్రటరీలు అలా వెళ్లగానే తిరిగి యధావిధిగా ఫుట్‌పాత్‌లపై దుకాణదారులు వారి సామగ్రిని పేర్చేశారు. దీనిపై ఆదివారం 'సాక్షి'లో తొలగించిన చోటే మొలకలు అన్న శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు సంయుక్తంగా డ్రైవ్ నిర్వహించారు. అయితే వీరు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో దుకాణదారులు వారి సామగ్రిని ఫుట్‌పాత్‌లపై లేకుండా జాగ్రత్త పడ్డారని స్థానికులు చెబుతున్నారు. అక్కడక్కడ ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. డ్రైవ్‌లో సీఐ శ్రీనివాసరావు, ఎస్ విజయ్‌కుమార్, పెందుర్తి ఎస్ఐ నర్సింగ్ రాజు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపట్నం ప్రధాన రహదారిలో తోపుడు బళ్లను తొలగిస్తున్న ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ అధికారులు

స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ ఛైర్మన్‌కు సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ ఛైర్మన్ హెచ్.కె. ఝా, కార్యదర్శి సూరిశెట్టి రామ్ ప్రసాద్‌లను సోమవారం ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా సీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ సమస్య పరిష్కరించడంలో వీరు చేసిన కృషి ఎనలేనిదన్నారు. డిమాండ్ లెటర్లకు స్పందించి నగదు జమ చేసి 15 నెలలు అయినా పెన్షన్ రాని విషయాన్ని కేంద్ర కార్మిక మంత్రి, కార్మిక శాఖ కార్యదర్శి, సెంట్రల్ పీఎఫ్ ట్రస్ట్, ట్రస్టీలను నిరంతరం స్పందిస్తూ వాటికి తగిన ఆధారాలు సమర్పించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సుమారు 5500 మంది ఉక్కు ఉద్యోగులకు పెన్షన్ వచ్చే విధంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీ నాయకులు చంద్ర వెంకటేశ్వరరావు, పి. లోకేష్, ఎం. అప్పారావు, ఉమా సుందరి తదితరులు పాల్గొన్నారు.



పీఎఫ్ ట్రస్ట్ ఛైర్మన్, కార్యదర్శులను సత్కరిస్తున్న సీ నాయకులు

స్టీల్‌ప్లాంట్ అధికారికి ఘనంగా వీడ్కోలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎన్టీపీసీలో ఉద్యోగం పొందిన ఇనుస్ట్రుమెంటేషన్ విభాగం అధికారి గోపాల్ ప్రసాద్ భగత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. విభాగంలో జరిగిన కార్యక్రమంలో సహ అధికారులు, కార్మికులు ఆయన్ను సత్కరించారు. వారు మాట్లాడుతూ గోపాల్ ప్రసాద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కనకరాజు, అన్నపరాజు, కిరణ్‌కుమార్, ఎల్లేటి శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, వెన్న శ్రీరామ్మూర్తి, కె. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సహోద్యోగులు

టిడ్కో గృహాలకు వసతులు కల్పించాలని ధర్నా



ఆందోళనలో పాల్గొన్న టిడ్కో గృహాల లబ్ధిదారులు

గాజువాక: టిడ్కో గృహ సముదాయంలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ లబ్ధిదారులు సోమవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు తక్షణమే స్పందించకపోతే టిడ్కో గృహాల ప్రాంగణంలో రిలే నిరసనకు దిగుతామని హెచ్చరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గృహాలను లబ్ధిదారులకు అందజేసి ఏడాది దాటుతున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. మౌలిక వసతులు లేకపోవడం వల్ల లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారన్నారు. వీటికితోడు టిడ్కో గృహాల కోసం మంజూరు చేసిన రుణాలకు ఈఎంఐలు కట్టుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో గృహ లబ్ధిదారులు ఇక్కట్ల పాలవుతున్నారన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పెదపూడి దుర్గారావు పాల్గొన్నారు.